పేరుకే గ్రామ పంచాయతీలు

మూడు నెలలుగా వేతనాల్లేవ్
- శిథిలావస్థలో కార్యాలయాలు
- నిధుల్లేక నానా అవస్థలు
- మరో ఏడాదితో తీరనున్న సర్పంచ్‌ల పదవీ కాలం



శిథిలావస్థలో ఉన్న అలియాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం



పాఠశాల భవనంలో పైడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పరకాల : నిధులు లేకపోవడంతో చిన్నపాటి గ్రామ పంచాయతీలు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొందరు సర్పంచ్‌లు ఏందుకు గెలిచాం.. పైసా నిధులు లేని పంచాయతీలకు.. సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులు.. ఏంటి గోల అంటూ బహిరంగంగానే గ్రామస్తుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న దుస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీల ఏర్పాటు సమయంలో సీఎం కేసీఆర్, స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో గ్రామ పరిపాలన వ్యవస్థ స్తంభించిపోతోంది. చిన్న గ్రామ పంచాయతీల పరిధిలో ఇండ్ల సంఖ్య 100–200 వరకే ఉంటుండడంతో ఆస్తి పన్నులు వసూలు కూడా నామమాత్రంగా ఉంటోంది. మొత్తం ఏడాది పన్నులు వసూలైనా సిబ్బంది 3 నెలల వేతనాలు కూడా సరిపోవడం లేదు.

మండలంలో 10 గ్రామ పంచాయతీలుండగా రాజిపేట, సీతారాంపూర్ పరకాల మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. కొత్తగా పైడిపల్లి, హైబోతుపల్లి పంచాయతీలుగా ఏర్పడ్డాయి. మూడున్నరేళ్లలో గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులు అంతంత మాత్రమే. పెద్ద గ్రామ పంచాయతీలకు నిల్వ ఉన్న నిధులు పరిపాలనకు దోహదపడుతుండగా కొత్త, చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు కొరత అభివృద్ధికి అవరోధంగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో సర్పంచ్‌లు అప్పు చేసి డబ్బులు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకొద్దామనుకున్నా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అధికారి పార్టీ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలు ప్రభుత్వ పాఠశాలల్లో, శిథిల భవనాల్లో నడుస్తున్నాయి. కొందరు సర్పంచ్‌లు తమ నివాసాలనే కార్యాలయాలుగా మార్చుకొని సిబ్బందితో సమావేశం అవుతున్నారు.

నిధుల కొరతతో ఇబ్బందులు



నిధుల కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పడగా తొలి సర్పంచ్‌గా ఎన్నికయ్యా. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతున్నానన్న బాధ కలుగుతోంది. వర్షాకాలంలో బురద రోడ్లు, అస్తవ్యస్థమైన డ్రైనేజీని కొత్తగా నిర్మించలేకపోయాం. గ్రామ పంచాయితీ భవనానికి రూ.12 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించినా ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

-అడ్డికిల సరిత, సర్పంచ్, పైడిపల్లి

ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం

- మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం



భూమి పూజ చేస్తున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్ : ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తానని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని తాటికాయల గ్రామంలో పరిశుద్ధ ఫాతిమా మాత చర్చి నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. కష్టపడితే సాధ్యం కానిదేదీ లేదని స్పష్టం చేశారు. అందరూ సమిష్టిగా కృషి చేసి చర్చిని నిర్మించుకోవాలని సూచించారు. చర్చి నిర్మాణానికి తన సహాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెసరు రమేష్, ఫాదర్లు పూడోట దాసయ్య, బాలశౌరి, థామస్ కిరణ్, ఎంపీటీసీ ననుబాల సోమక్క, ఉపసర్పంచ్ అన్నపూర్ణ, పెద్దపెండ్యాల మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు, రాయిగూడెం సర్పంచ్ వాంకుడోతు రాజమణి మొగిలి, చర్చి నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఎర్ర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్, సంఘ పెద్దలు రాజు, రాజన్న, జీడీ శ్రీకాంత్, పట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కరాటే'లో గ్రాండ్ చాంపియన్ కైవసం

- 'క్రియేటివ్ కరాటే డో' క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

పరకాల : పునకోచి శాటో ఖాన్ కరాటే డో ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పరకాల పట్టణానికి చెందిన క్రియేటివ్ కరాటే డో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు గ్రాండ్ చాంపియన్‌తోపాటు బంగారు పతకాలు సాధించారని క్లబ్ వ్యవస్థాపకుడు మాడ సంపత్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. హన్మకొండలోని శైని స్కూల్‌లో జరిగిన టోర్నమెంట్‌లో బాలుర స్పారింగ్ విభాగంలో మేకల ప్రత్యూష్ రాజ్ బంగారు పతకంతో పాటు గ్రాండ్ చాంపియన్ సాధించాడని చెప్పారు. సబ్ జూనియర్ విభాగాల్లో స్పారింగ్ ఈవెంట్‌లో మనిదీప్, ఆదిత్య, రిత్విక్‌రేరావు, స్టాన్లీ, సాయితేజ బంగారు పతకాలు సాధించారని చెప్పారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విజేతలకు ఇండియా చీఫ్ పి.పాపయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విప్‌గా కౌశిక్‌రెడ్డి నియామకంపై హర్షం



కౌశిక్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి నియామకం పట్ల మండలంలోని మర్రిపల్లిగూడెం, శనిగరం, కన్నూరు తదితర గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కౌశిక్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కౌశిక్‌రెడ్డిని కలిసిన వారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పింగిలి ప్రదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏలిమి కుమారస్వామి, నాయకులు పొరండ్ల రమేష్, ఇనుగాల విజయ్‌కుమార్, కదురు తిరుపతి ఉన్నారు.

ఈదమ్మ ఎల్లమ్మ పట్నాలు ప్రారంభం



ఈదమ్మ ఎల్లమ్మ గుడికి వెళ్తున్న బాసాని వంశీయులు

శాయంపేట : మండల కేంద్రంలో బాసాని వారి ఈదమ్మ ఎల్లమ్మ పట్నాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏటా ఐదేళ్లకోసారి ఘనంగా పట్నాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బాసాని వంశస్తులు డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్, బాణాసంచా కాలుస్తూ బోనాలతో వెళ్లి పట్నాలు వేయడం పరిపాటి. కనకదుర్గమ్మ వద్ద జంతు బలి నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లమ సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు బాసాని చంద్రప్రకాశ్, అధ్యక్షుడు బాసాని ప్రకాశ్, ఉపాధ్యక్షుడు సదాశివుడు, ప్రధాన కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి రాజు, రఘుపతి, కోశాధికారి మల్లయ్య, సలహా కమిటీ సభ్యులు జనార్దన్, రవి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నాగభూషణ్, సర్వేశం, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం.. ఆరోపణలు సరికాదు..

- విశ్వనాథకాలనీ సర్పంచ్ వల్లెపు అనిత

భీమదేవరపల్లి : విశ్వనాథకాలనీ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని, తనపై ఆరోపణలు చేయడం సరికాదని సర్పంచ్ వల్లెపు అనిత రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో కొప్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో కాలనీ ఉండగా కొత్తగా పంచాయతీ అయ్యిందని చెప్పారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ సమకారంతో గ్రామంలో డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం, పల్లెప్రకృతి వనంతోపాటుగా గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేసినట్లు తెలిపారు. స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారుల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇటీవలే రూ.20 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనం, రూ.5 లక్షలతో మహిళా సంఘ భవనం, రూ.5 లక్షలతో మురికి కాలువ పనులు సైతం మంజూరయ్యాయని చెప్పారు. వాటి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో పోచమ్మ గుడి, హన్మండ్ల గుడి, బొడ్రాయి పండుగ కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామంలోని కొందరు దురుద్దేశ్యంతో తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు.

యువత క్రీడామైదానాల వైపు పరుగెత్తాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మహ్మద్ అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రీడామైదానాల వైపు పరుగులెత్తాలని కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. రాజ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో, వరంగల్ ఒలిపింక్ సంఘం, చక్రవర్తి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉదయం ఎన్ఐటీ నుంచి హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ వరకు 3కే లవ్ ఫిట్ రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అభినవ్‌భాస్కర్ హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత దేశానికి ఎనలేని సంపదని పేర్కొన్నారు. 3కే ఫిట్ రన్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన, ఆవశ్యకత కోసమే రన్ నిర్వహించినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి వరంగల్ ఒలింపిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు, రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత ఆడెపు శ్రీను, సృజన్ కాంత్, అంజనీదేవి, మాస్టర్ సతీష్, డాక్టర్ తరుణ్‌రెడ్డి, చిర్ర రాజ్‌కుమార్, సాజిద్, తిరుపతి, నందు, గంగాధర్, సునీత, నాగమణి, దళజిత్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బాలిక సత్తా



ఖిలా వరంగల్: వరంగల్ నగరం 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామానికి చెందిన పసునూరి భాస్కర్, కర్ణ దంపతుల కుమార్తె వైష్ణవి.. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటింది. పర్వతగిరి కస్తుర్బా ఆదర్శ పాఠశాలలో వైష్ణవి 9వ తరగతి చదువుతోంది. ఇటీవల వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ –13 పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించింది. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఆమెను బీఆర్ఎస్ నాయకులు మాటేటి రమేష్, పసునూరి భాస్కర్, యువరాజు, వంశీ, రమేష్‌తో కలిసి కార్పొరేటర్ గద్దె బాబు అభినందించారు.

దహన సంస్కారాలకు చేయూత



ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు కోటకు చెందిన వడ్డె రాజు (45) అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందారు. ఈమేరకు రాజు మృతదేహాన్ని బీజేపీ నాయకుడు నాంద్రే అమర్‌నాథ్‌తో కలిసి బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ సందర్శించారు. మృతదేహంపై పూల మాల ఉంచి నివాళులర్పించారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు బిల్ల కిషోర్, చింతం రమేష్, బొలుగొడ్డు నాగేందర్, బేర నరేందర్, ఏసీరెడ్డి రంజిత్, వినయ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఓటు అడిగే హక్కు లేదు

- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి



పరకాల : మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

పరకాల : స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి దళితులను ఓటు అడిగే హక్కులేదని బీజేపీ ఆలేరు పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తెలిపారు. దమ్ముంటే హుజురాబాద్ ఉపఎన్నిక మాదిరిగా పరకాల నియోజకవర్గంలో అన్ని పేద దళిత కుటుంబాలకు దళితబంధు పథకాన్ని వర్తింపజేసిన తర్వాతే ఓటు అడుగాలని సవాలు విసిరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 40, 43 బూత్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ ఆర్‌పీ.జయంత్‌లాల్ అధ్యక్షతన కూరగాయాల మార్కెట్‌లోని శక్తి స్థల్ వద్ద మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్ నియంత తరహాలో పాలన సాగించడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తి, ప్రజలకు ఏకైక దిక్కుగా నిలుస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో హుస్నాబాద్, కొత్తగూడెం అసెంబ్లీ పాలక్ దేవునూరి మేఘనాథ్, పరకాల పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే విజయం

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తేనే రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రావు అమరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జీల్గుల, పెంచికలపేట గ్రామాల్లో శక్తి కేంద్రం పరిధిలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఇన్‌చార్జ్ ముష్కె వెంకటేష్ అధ్యక్షత వహించగా అమరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, కంచర్ల శంకరయ్య, చిదురాల వెంకటేష్, మధుకర్, శ్రీకాంత్, బీట్ల లింగయ్య, ఎర్రోళ్ళ రాజు, రమణచారి, భగువాన్‌గౌడ్, మధు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చూపు.. బీజేపీ వైపు..'

ఆత్మకూరు : బీఆర్ఎస్ పాలన పట్ల విరక్తి చెందిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని అక్కంపేటలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రవ్వ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. బీజేపీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఉపాధ్యక్షుడు గట్టు వేణుగౌడ్, నాయకులు పెండ్లి రమణ, సుమన్, సాయికృష్ణ, సురేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కమిటీ సభ్యుల ఎన్నిక



మంత్రి, చీఫ్‌విప్‌ను కలిసిన రాజు



గోరంటల మనోహర్

కాజీపేట / హన్మకొండ: ఆర్‌టీఏ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీ సభ్యులను నియమించారు. హనుమకొండ రవాణాశాఖ కార్యాలయ కమిటీ సభ్యుడిగా రాజును కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఉత్తర్వులను రాజుకు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం అందజేశారు. కాజీపేట పట్టణం సోమిడి గ్రామానికి చెందిన రాజును మూడోసారి ఆర్టీఏ కమిటీ సభ్యుడిగా కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వరంగల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడిగా మనోహర్

వరంగల్: వరంగల్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడిగా కాశిబుగ్గకు చెందిన గోరంటల మనోహర్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు కాశిబుగ్గకు చెందిన మనోహర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆశీస్సులతో ఈ అవకాశం లభించిందని తెలిపారు.

కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి



పాదయాత్రలో నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 54వ డివిజన్‌లో హనుమాన్‌నగర్ రోడ్ –2 వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆదివారం నాయిని ఆవిష్కరించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాహుల్‌గాంధీ సందేశం కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి కుల సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చి ఒక్క కమ్యూనిటీ హాల్ కూడా నిర్మించలేదని విమర్శించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే డివిజన్‌లో ఏం చేశారని ప్రశ్నించారు. 54వ డివిజన్‌ను తాను దత్తత తీసుకుంటున్నానని, రెండేళ్లలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని పేర్కొన్నారు.

నగరాభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం



పాదయాత్ర నిర్వహిస్తున్న కొండా సురేఖ

రామన్నపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నగరంలోని 24వ డివిజన్ గోపాలస్వామి దేవస్థానం నుంచి గీతం స్కూల్, ఎస్ఎస్‌కే సేవ సమాజ్, పాపయ్యపేట చమాన్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఎల్లం బజార్, పతంజన్ కళాశాల మీదుగా ఆదివారం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికి కొండా సురేఖ తిరుగుతూ ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్‌ను కలిసి కరపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని విమర్శించారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో సర్కారు విఫలమయ్యారని ఆరోపించారు.

రేపటి నుంచి తాండ్ర కుమార్ వర్ధంతి కార్యక్రమాలు



వరంగల్ చౌరస్తా: ఎంసీపీఐ(యూ) రాష్ట్ర మాజీ కార్యదర్శి తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాలను ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పార్టీ నగర కార్యదర్శి గడ్డం నాగార్జున తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో తాండ్ర కుమార్ వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 14న మియాపూర్‌లో తాండ్రకుమార్ స్మారక స్థూపం నుంచి ముజాఫర్ అహ్మద్‌నగర్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి జగదీశ్వర్, సభ్యులు మాలి ప్రభాకర్, నగేష్, నలువేల రవి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌టీపీ యూత్ జిల్లా అధ్యక్షుడిగా మహేష్

ఆత్మకూరు : వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన జన్నారపు మహేష్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మహేష్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తనను నియమించినందుకు పార్టీ అధినేత్రి షర్మిల, జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో యువజన విభాగ, పార్టీ బలోపేతానికి పాటు పడతానని చెప్పారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన, సుపరిపాలన దిశగా పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లనున్నట్టు వివరించారు.

వైద్యశిబిరం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో ధర్మరుద్ర క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్షం బలరామ్, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు అర్షం వరుణ్‌గాంధీ, రవీందర్, సత్యం, విజయ్‌కుమార్, సాగర్, క్రాంతి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

రేపు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తండ్రి గండ్ర మోహన్‌రెడ్డి స్మారకంగా ఏర్పాటు చేసిన జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా ఈనెల 14న నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో 14న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న రిజిస్ట్రేషన్‌కు హాజరై పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం




ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన మంగలపల్లి బాబు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు మంగళవారం రూ.25 వేలు సాయం అందించారు. తొలుత బాబు కుటుంబాన్ని అతడి మిత్రులు పరామర్శించారు. అనంతరం సాయం అందించి మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ముక్క వేణు, ఎంపీపీ మార్క సుమలత, ఉపసర్పంచ్ లావణ్య, భిక్షపతి, కరుణాకర్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి ట్రెయినీ ఐపీఎస్ పూజలు



ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామికి ట్రెయినీ ఐపీఎస్ ఆడెపు వర్షిత ఆదివారం పూజలు చేశారు. హనుమకొండకు చెందిన వర్షిత తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షితను ఆలయ ప్రధాన అర్చకుడు వినయ్ శర్మ కండువాతో సత్కరించారు. ఆమె వెంట ఆమె తల్లిదండ్రులు రాధారాణి, రాజా కట్టమల్లు ఉన్నారు.

వైభవంగా చెన్నకేశవ కల్యాణం



మడికొండ: కాజీపేట మండలంలోని మడికొండ గ్రామంలోని శివకేశవ ఆలయంలో ఆదివారం ఉదయం చెన్నకేశవ స్వామి కల్యాణం నిర్వహించారు. అర్చకులు అనుముల నవీన్, వంశీకృష్ణ చార్యుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజశేఖరం–నిర్మలాదేవి, తాటిరెడ్డి విద్యాసాగర్ రెడ్డి–విజయలక్ష్మి, బోనగిరి సరిత–నర్సింహారావు దంపతుల సహకారంతో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్, సుదర్శన్‌రెడ్డి, రవీందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.